క్లుప్తంగా

మినీ జాబ్‌మేళాలో 46 మందికి ఉద్యోగాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 46 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. మొత్తం 65 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కాగా, అందులో 46 మందికి యాక్సిస్ బ్యాంకు, ఐఐటీ స్కిల్స్ అకాడెమీ, ఫోన్‌పే, ఫ్యుషన్ ఫైనాన్స్ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

3 నుంచి ఏఐవైఎఫ్ వర్క్‌షాప్

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 3, 4, 5 తేదీల్లో విజయవాడలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి కోరారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఆ సంఘం నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షతన కర్నూలు నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తుంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. వర్క్‌షాపులో నిరుద్యోగ సమస్యపై చర్చించి పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. నాయకులు బాబయ్య, చంటి, కాశీం, సయ్యద్, శివ పాల్గొన్నారు.

30న సత్యసాయి కళాక్షేత్రం ప్రారంభం

కర్నూలు కల్చరల్: సత్యసాయి కళాక్షేత్రం ప్రారంభోత్సవం ఈనెల 30న ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థల అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాక్షేత్రం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 29న ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కన్వీనర్ మాకా అశోక్ కుమార్ మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం 8.27 గంటలకు కళాక్షేత్రం ప్రారంభం జరుగుతుందన్నారు. 10 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని చెప్పారు. సేవా సంస్థల మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సీనియర్ సేవాదల్ రామ్మోహన్, జిల్లా మహిళా సేవాదల్ ఇన్‌ఛార్జి లక్ష్మీ సరోజ, మహిళా కన్వీనర్ సంధ్య, యూత్ కన్వీనర్ సందీప్, సప్తపతి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ లైన్లు, మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. డి2 సబ్ డివిజన్ పరిధిలోని క్యాంపస్ సెక్షన్‌లో ఉన్న బి.క్యాంప్ ప్రాంతం, సోమప్ప కాలనీ, మహాలక్ష్మీ నగర్, అరోరా నగర్, టెలికాం నగర్, లెక్చరర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపారులు సహకరించాలని కోరారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని కలిసిన యూనియన్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని విన్నవించారు. మంగళవారం కర్నూలుకు వచ్చిన ఆయన యూనియన్ సభ్యులతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేసే అన్ని కేటగిరీల ఉద్యోగుల సమస్యల గురించి చర్చించారు. ప్రాధాన్యత అంశాల వారీగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాధవరావు, ప్రధాన కార్యదర్శి సి.బంగారి, ఉపాధ్యక్షులు శాంతిలత తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

కర్నూలు(సెంట్రల్): పరిపూర్ణ సంఘం ద్వారానే సామాజిక హక్కుల కోసం ఉద్యమించేందుకు అవకాశం కలుగుతుందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దళితులు, గిరిజనుల హక్కుల కోసం పోరాటాలు చేయాలన్నారు. భూమి, ఇళ్లులేని వారి కోసం ఉద్యమించాలని సూచించారు. నాయకులు డి.విజయమ్మ, కరుణాకర్, భాస్కర్, పెద్దబాబు పాల్గొన్నారు.

టాయ్‌లెట్స్ కూడా లేవు



కర్నూలు (హాస్పిటల్): గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం కింద విధులకు వెళ్లే మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది తగిన వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారు గ్రామాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వారు టాయ్‌లెట్‌కు వెళ్లేందుకు సైతం అవకాశం ఉండటం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు ఆలోచన చేయాలి. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పీజీలు రోజంతా పనిచేస్తున్నారు. దీనివల్ల తీవ్ర అలసటకు గురవుతున్నారు. అలాగాకుండా 12 గంటలు పనిచేయించి, మరో 12 గంటలు విశ్రాంతినివ్వాలి. రాత్రి డ్యూటీ చేసిన వారికి మరుసటి రోజు డే ఆఫ్ ఇవ్వాలి. ఆసుపత్రుల్లో సెక్యూరిటీ ఫోర్స్, మహిళలకు భద్రత పెంచాలి. రెస్ట్‌రూమ్స్, వాష్‌రూమ్స్ సరిపడా ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ ఎంవీఎస్ఎస్ భాస్కరరెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్, కర్నూలు



ప్రతి చిన్నారి వైద్యమూ మాకు ఎమర్జెన్సీనే !



కర్నూలు (హాస్పిటల్): చిన్నపిల్లల విభాగంలో ప్రతిరోజూ, ప్రతి చిన్నారికీ ఇస్తున్న వైద్యం ఎమర్జెన్సీనే. ఎందుకంటే ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు చాలా మంది వస్తారు. ఆ చిన్నారికి ఏదైనా జరిగితే వారు తీవ్ర భావోద్వేగానికి గురవుతారు. ఇలాంటి సమయంలో కొందరు దాడులకు దిగే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో రోగులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలో పీజీలు మూలస్తంభాల్లా పనిచేస్తారు. వారికి పనిగంటలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి. వారికి లీవ్‌లు, నైట్ డ్యూటీ చేసిన వారికి డే ఆఫ్‌లు ఇవ్వాలి. రీఫ్రెష్‌మెంట్ కోసం కళాశాలలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలి. వారికి పని ఒత్తిడి తగ్గించాలి. వారు పనితో పాటు చదువుకోవాలి కదా..!

– డాక్టర్ ఎం.మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్, కర్నూలు

మట్టి గణపయ్య... మమ్మేల రావయ్యా

- పీఓపీతో పర్యావరణానికి ముప్పు
- మట్టి విగ్రహాలపై చైతన్యం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- సెప్టెంబర్ 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలు





విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న శిల్పి కెనరాం పాల్, విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇల్లు, వాడ, వీధి, ఊరు అంతటా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏటా ఈ పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జనంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతూనే ఉంది. పీఓపీ విగ్రహాల వల్ల అనర్థాలపై స్వచ్ఛంద సంస్థలు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయి. దీంతో ప్రజల్లోనూ కొంత మార్పు వస్తోంది.

వినాయక చవితి కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఇతర ప్రాంతాల నుంచి శిల్పకారులు వచ్చి స్థానికంగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. భారీ సంఖ్యలో పీఓపీ విగ్రహాలను ఇప్పటికే తయారు చేసేశారు. అయితే ప్రతిమల కోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వినియోగించకుండా మట్టి విగ్రహాలను పూజిస్తే మేలని అధికారులు, పండితులు సూచిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఉత్సవాలు కాలుష్యానికి కారణం కారాదనే ఉద్దేశంతో ప్రచారం, అవగాహన కల్పిస్తున్నారు.

పెరగనున్న విగ్రహాలు

కర్నూలు నగరంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలు రాష్ట్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం 43వ సంవత్సరం వేడుకలను నిర్వహిస్తున్నారు. రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయక చవితి ప్రస్థానం ఇప్పుడు 2500 విగ్రహాలకు చేరుకుంది. దీంతో పాటు రాష్ట్రంలోనే ఎత్తైన 63 అడుగుల భారీ మట్టి వినాయకుడిని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఎకో ఫ్రెండ్లీ వినాయకుడికి జై కొడుతున్నారు. అలాగే ఈ ఏడాది మట్టి విగ్రహాల ఏర్పాటు గణనీయంగా పెరిగింది. సుమారు 800 మట్టి గణనాథులను ప్రతిష్ఠించనున్నారు. కోల్‌కతా, గుజరాత్, రాజస్థాన్ నుంచి వచ్చిన శిల్ప కళాకారులు ప్రత్యేకంగా షెడ్లు వేసుకొని విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పాటు గృహాల్లో పూజించుకోడానికి సుమారు 25 వేల మట్టి విగ్రహాలను వివిధ స్వచ్ఛంద, ఆధ్యాత్మిక, ప్రజా సంఘాల వారు ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. కొన్ని చోట్ల ఉత్సవ సమితులు ప్లాస్టిక్ రహితంగా వేడుకలను నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకున్నారు.

మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాం

గత ఆరు నెలల నుంచి కర్నూలు వెంగన్నబావి సమీపంలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాం. పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాం. బంక మట్టి, ఎర్రమట్టి, వరి గడ్డి, గోనె సంచులు, వెదురు కర్రలతో వాటర్ కలర్స్‌తో విగ్రహాలకు రూపునిస్తున్నాం. 5 నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలను అందుబాటులో ఉంచా. డిజైన్, ఆకారం బట్టి రూ.10 నుంచి రూ.50 వేల వరకు ధర ఉంటుంది. ఇప్పటికే చాలా విగ్రహాలు బుకింగ్ అయ్యాయి.

– కెనెరాం పాల్, శిల్ప కళాకారుడు, పశ్చిమ బెంగాల్

పర్యావరణ హితమే పండుగ ఉద్దేశం

హిందువులు ప్రతి శుభకార్యానికి ముందు గణపతి పూజ చేసి పని ప్రారంభిస్తారు. పంచ భూతాల్లో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకుడిని పూజించడంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నది పండితుల మాట. వివిధ రకాల ఆకులు, పుష్పాల సువాసనల నుంచి మిశ్రమ వాయువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు దూరం కావడంతో పాటు మెదడు ఉత్తేజితం అవుతుంది. ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించడం తిరిగి వాటిని నీటిలో నిమజ్జనం చేయడంతో అవి సులువుగా కరిగి పంట పొలాలకు చేరడంతో భూములు సారవంతం అవుతాయి.

విస్మరిస్తే ముప్పే

ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న భారీ వినాయక విగ్రహాల్లో దాదాపు 80 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసినవే ఉంటున్నాయి. బరువు లేకుండా ఆకర్షణీయంగా కనిపించడం కోసం తయారీదారులు ఈ పదార్థాన్ని ఎంచుకుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌కు ఆలస్యంగా కరిగే గుణం ఉంది. ప్రతిమల్లో జిప్సం, సీజం, కాడ్మియం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, తదితర విష రసాయనాలు ఉంటాయి. ఇవి నీటిలో చేరినప్పుడు అందులోని ఆక్సిజన్‌ను తగ్గించి ఆమ్లత్వాన్ని పెంచుతాయని పర్యావరణ నిపుణుల ప్రయోగాల్లో తేలింది.



సిద్ధమవుతున్న 63 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం (ఇన్‌సెట్) విగ్రహ నమూనా

పర్యావరణానికి ముప్పు ఇలా..

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ ఏళ్ల గడిచినా భూమిలో కలవదు.
- విగ్రహాలకు ఉపయోగించే రంగుల్లో సిలికా, జింక్, చాక్‌పీస్, గాజు పొడి కలుపుతారు. ఇవి నీటిలో కలిస్తే ప్రమాదకరం.
- ఎరుపు రంగు కోసం మెర్క్యూరీ సల్ఫేట్ వాడతారు. దీని వల్ల చర్మ వ్యాధులు, దద్దుర్లు వస్తాయి.
- నలుపు రంగు కోసం రెడ్ ఆక్సైడ్, క్యాడ్మియం, వాడతారు. వీటి వల్ల గ్రహణ శక్తి తగ్గుతుంది. మూత్ర పిండాల ఇన్‌ఫెక్షన్, పిల్లల శారీరక, మానసిక ప్రవర్తనలో మార్పులు వస్తాయి.
- నీలిరంగు కోసం క్రోమియం, ఆయోడైడ్ వాడుతున్నారు. వీటితో అలర్జీ, ఉబ్బసం, న్యూమోనియాలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది,.
- గులాబీ రంగు కోసం పొటాషియం, డైక్రోమిట్ వాడుతున్నారు. వీటితో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- వినాయక నిమజ్జనోత్సవాలు, ఊరేగింపుల్లో, ఉట్టి కొట్టే సమయాల్లో రసాయన రంగుల వాడకంతో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. కంటిపరమైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.







ఉత్సవాలకు సిద్ధమవుతున్న మట్టి వినాయక విగ్రహాలు

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలిత పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు అర్బన్ ఒకటో సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలపై అవగాహన కల్పించి పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా, నగర కార్యదర్శులు ఎస్.మునెప్ప, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుందాం



వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలి. ఉత్సవ సమితి ద్వారా ప్రతినిధులకు ఇదే సూచిస్తున్నాం. ప్రజల్లో క్రమంగా మార్పు వస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వాడకాన్ని తగ్గించి మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోనే దిశగా మార్పు రావడం శుభపరిణామం. యువత, విద్యార్థులు చైతన్యవంతమైతే సమాజానికి మరింత మేలు జరుగుతుంది. మండపాల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి.

– వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యమిద్దాం



మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలి. వీటి ధర కూడా తక్కువగా ఉంటుంది. నీటిలో సులభంగా కరుగుతాయి. కాలుష్యాన్ని కలిగించవు. పర్యావరణంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలనే విషయాన్ని ప్రజలు గ్రహించాలి. ఇప్పటికే మట్టి విగ్రహాల వాడకం క్రమంగా పెరుగుతోంది. పర్యావరణ హితంగా పండుగను జరుపుకోవడం అందరి బాధ్యతగా భావించాలి.

– నారాయణ రెడ్డి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర కార్యాధ్యక్షుడు

కిమ్స్ హాస్పిటల్‌కు నోటీసులు



కిమ్స్ హాస్పిటల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీఎస్ఎన్ భాస్కరరెడ్డి నోటీసులు జారీ చేశారు. సోమవారం ప్రకాశం జిల్లాకు చెందిన కావేరి అనే ఆరేళ్ల బాలిక ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయమై స్పందించిన వైద్యసేవ అధికారులు మంగళవారం కిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి విచారణ జరిపారు. కావేరికి సంబంధించిన కేస్‌షీట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రిపోర్టులు కావాలని కోరారు. పాపకు డెంగీ వ్యాధి ఉన్నట్లయితే ఆరోగ్యశ్రీ కింద ఎందుకు చికిత్స చేయలేదని ప్రశ్నించారు. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

భూ బకాసురులను వదిలిపెట్టం



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కర్నూలు(టౌన్): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో పలువురు భూములను అక్రమంగా కబ్జా చేశారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం స్థానిక బైరెడ్డి కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా భూదోపిడీ యథేచ్ఛగా సాగిందన్నారు. రికార్డులను తారుమారు చేసి రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్టు, వక్ఫ్‌బోర్డు భూములు, దేవదాయ శాఖకు చెందిన వేలాది భూములను నేతలు, రియల్టర్లు, బిల్డర్లు అక్రమించుకున్నారన్నారు. కేసీ కెనాల్, హంద్రీ వెంట బఫర్ జోన్లను వదలకుండా కబ్జా చేశారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున అక్రమ లేఅవుట్లు వెలిశాయని, కార్పొరేషన్, కుడా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారన్నారు. వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, భూఅక్రమాలపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

భూ ఆక్రమణపై బైరెడ్డి ఆరోపణలివీ

- హంద్రీ నదిలో 470/బి సర్వే నంబర్‌లో 50 మీటర్ల బఫర్ జోన్‌ను బి.కె.సింగ్ ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టారు.
- కల్లూరు మండలం లక్ష్మీపురంలో సర్వే నంబర్ 678 లో 2.17 ఎకరాల వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించారు.
- కల్లూరులో సర్వే నంబర్ 645/ఏ లో 5 ఎకరాల స్థలాన్ని ఆక్రమించి సింధూ కాలనీ పేరుతో డూప్లెక్స్ భవనాలు నిర్మించారు.
- కర్నూలు మండలం దిన్నెదేవరపాడులో సర్వే నంబర్ 19లో 7 ఎకరాల వక్ఫ్‌బోర్డు స్థలాన్ని ఆక్రమించి పట్టా ల్యాండ్‌గా మార్పులు చేసి డూప్లెక్స్ భవనాలు కడుతున్నారు.
- వెల్దుర్తి మండలం నార్లాపురంలో సర్వే నంబర్ 234, 241, 230, 240లో వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి అమెజాన్ రిసార్ట్స్ నిర్మించారని ఆరోపించారు.

తహసీల్దార్, ఆర్ఐపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): తప్పుడు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం జారీ చేసిన కౌతాళం మండలం తహసీల్దార్, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కుశలన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌టీఎఫ్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న కౌతాళం తహసీల్దార్, ఆర్ఐ మాదిగ కులానికి చెందిన నల్లగోడి శ్రీనివాసులుకు ఎస్టీ(ఎరుకల) ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్‌డీఓ సేవలు అమోఘం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ డిప్యూటీ పీడీ వీరబ్రహ్మం

కర్నూలు సిటీ: దేశంలోని వివిధ రంగాల్లో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)అందిస్తున్న సేవలు అమోఘమని ఆ సంస్థ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ వీరబ్రహ్మం అన్నారు. మంగళవారం నంద్యాల చెక్‌పోస్టు గౌతమి నగర్‌లోని గుడ్‌షెప్పర్డ్ స్కూల్లో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. డీఆర్‌డీఓ దేశంలోని వాయు, నేవీ, ఆర్మీ రంగాల్లో అనేక రకాల సేవలు, ఆవిష్కరణలు చేస్తుందన్నారు. అణు ఆయుధాలను, క్షిపణులను అందిస్తుందని వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించేందుకు సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు సిద్ధం అవుతున్నామని, మొక్కజొన్న నుంచి కవర్లను తయారు చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కరెస్పాండెంట్ యేసుదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు తెలుగు భాషా దినోత్సవం

కర్నూలు కల్చరల్: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా శిష్య బృందంచే తెలుగు భాషా విశిష్టతపై నృత్య ప్రదర్శనలు, తెలుగు భాషా విశిష్ట సేవకులకు సత్కారం,వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేడు భూబాధితుల సదస్సు

కర్నూలు(సెంట్రల్):విజయవాడలో బుధవారం జరిగే భూ బాధితుల సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దబోళం శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి అధికసంఖ్యలో భూ బాధితులు హాజరు కావాలని కోరారు. పేదలు తీసుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. భూమి లేని పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై వినతిపత్రం అందజేత

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌యూ నాన్ టీచింగ్ టైంస్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం పసుపులలోని ఎమ్మెల్యే గృహంలో ఆయన్ను కలిసి వర్సిటీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పి.సుంకన్న మాట్లాడుతూ.. సస్పెండ్ అయిన నాన్ టీచింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, 150 రెగ్యులర్ నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేయించాలని, టైం స్కేల్ ఉద్యోగులకు ఫైనాన్స్ కాంకరెన్స్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ జీతాలను ఇప్పించాలని, పదవీ విరమణ చేసే నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా వెళుతున్నారని వారికి రూ.10 లక్షల ఇప్పించాలనే విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. సంఘం కార్యదర్శి మద్దయ్య, కోశాధికారి హుసేనయ్య, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, జాయింట్ సెక్రటరీ అనురాధ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, తదితరులు ఉన్నారు.

కేఎంసీలో వైద్య విద్యార్థుల చేరిక

కర్నూలు(హాస్పిటల్): ఆలిండియా కోటాలో భాగంగా ఐదుగురు విద్యార్థులు మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ సమక్షంలో చేరారు. విద్యార్థులు షేక్ అబ్దుల్ ఫయాజ్ అలీ, మహమ్మద్ జుహేర్, బి.ప్రభాస్ చౌదరి, నరసింహమూర్తి గారి సాయి నిశాంత్, దాసరి మధుహ ఉన్నారు.



ఏ.సుధాగ్రేస్‌కు నియామక పత్రం అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య

బాధ్యతగా పనిచేయాలి

కర్నూలు (టౌన్): చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ బీవై రామయ్య సూచించారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా ఏ.సుధాగ్రేస్‌కు నియామక పత్రం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ.. 2020 మే నెల 21న మైఖేల్ మృతి చెందారని, ఆయన కుమార్తెను జూనియర్ అసిస్టెంట్‌గా నియమించినట్లు చెప్పారు. మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ ఇశ్రాయేలు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, కార్పొరేటర్లు విక్రమ సింహారెడ్డి, క్రిష్ణకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

దొంగను పట్టించిన సిబ్బందికి ప్రశంసలు

కర్నూలు (టౌన్): దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన మున్సిపల్ సిబ్బందిని మేయర్ బీవై రామయ్య ప్రశంసించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 23వ వార్డు శ్రీరామ నగర్ క్వార్టర్స్‌లో ఈనెల 22వ తేదీన ఓ దొంగ ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్ తస్కరించి పారిపోతుండగా విధుల్లో ఉన్న శానిటేషన్ కార్యదర్శి ఏంజిల్ ప్రణీత, మేస్త్రీ సురేష్, కార్మికురాలు శిరీష వెంటపడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో మంగళవారం మున్సిపల్ సిబ్బందిని మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్ కటారి పల్లవితో కలిసి తన చాంబర్‌లో శాలువా కప్పి సన్మానించారు. మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, నాయకులు కటారి సురేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత

కర్నూలు (టౌన్): విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత క్రీడలతోనే సాధ్యమవుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మంగళవారం అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

అధ్వానంగా సంక్షేమ వసతి గృహాలు



దీక్షలను ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు జైళ్ల కంటే అధ్వానంగా ఉన్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చౌక్‌లో మూడు రోజుల దీక్షలకు శ్రీకారం చుట్టారు. మొదటి రోజు దీక్షలను ఎస్.మునెప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషాతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలని, వార్డెన్‌లు, కమాటీలు, కుక్‌లు, వాచ్‌మన్ పోస్టులు భర్తీ చేయాలని, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెస్ చార్జీల కింద ఇస్తున్న రూ.33 ఏమాత్రం సరిపోవడం లేదని, అన్న క్యాంటీన్లలో మూడు పూటల ఆహారానికి రూ.90, జైళ్లలో ఖైదీలకు రూ.75 ప్రభుత్వం ఖర్చు చేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం అన్నా క్యాంటీన్లకు ఇచ్చే మెస్ చార్జీలను హాస్టళ్లకు ఇవ్వాలని కోరారు. నాయకులు పి.రామకృష్ణారెడ్డి, లలితమ్మ,చంద్రశేఖర శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలో జరిగే ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతన బకాయిలు, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. వాచ్‌మన్ నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా మారిన కార్మికులకు పాత ఆపరేటర్లతో సమానంగా రూ.27,953 వేతనం ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఐటీఐ అర్హత ఉంటే స్కిల్డ్‌గా ప్రమోట్ చేయాలని కోరారు. నాయకులు చలపతి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.